క్లుప్తంగా

జగన్‌ను కలసిన రమాదేవి



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలసిన ఆకృతి ఫౌండేషన్ చైర్ పర్సన్ రమాదేవి

రామచంద్రపురం: మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆకృతి ఎస్ఎస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కటారి రమాదేవి తాడేపల్లిలోని ఆయన స్వగృహంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు ట్రస్ట్ కోశాధికారి పెంకే సుబ్రహ్మణ్యం, కటారి సందీప్ కుమార్‌లు స్థానిక విలేకరులకు వెల్లడించారు. ఆకలితో ఉన్నవారి కడుపు నింపడమే ఆకృతి ఎస్ఎస్ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశం అని మాజీ సీఎం జగన్‌కు వివరించడం జరిగిందని తెలిపారు. ఇలాంటి మంచి సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు వైఎస్ జగన్ వారిని అభినందించినట్లు తెలిపారు.

ధనమ్మమర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామ శివారు వీధివారి లంకలో వెలసిన ధనమ్మతల్లిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో విద్యార్థులు, ఉద్యోగ, వ్యాపారులు ధనమ్మమర్రిలో సందడి చేశారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. గోదావరి, ఉద్యాన పంటలతో ఆహ్లాద కరంగా ఉన్న ప్రాంతంలో ఫొటోలు దిగి సంబర పడ్డారు.

మంత్రి సుభాష్‌ను కలిసిన కార్మిక సంఘం నాయకులు



మంత్రి సుభాష్‌తో కార్మిక సంఘాల నాయకులు

కపిలేశ్వరపురం: రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను మండలానికి చెందిన తాపీ మేస్త్రీలు, శిల్పకళాకారుల సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసారు. రామచంద్రపురంలోని మంత్రి కార్యాలయంలో ఆదివారం ఆయనను కలసి కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. క్షేత్ర స్థాయిలో కార్మికులు ఎదుర్కొంటున్న పరిస్థితులను వివరించారు. కార్మికుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానంటూ మంత్రి చెప్పినట్టు సంఘాల నాయకులు చీకట్ల గంగరాజు, నిడదవోలు ప్రతాప్, మేడేపల్లి వీరాస్వామి, సుంకర బుజ్జి, కట్టా నాగేంద్ర, సిద్ధిరెడ్డి శ్రీను తదితరులు తెలిపారు.

పందుల స్వైర విహారం



ఉన్నత పాఠశాల రోడ్డుపై తిరుగుతున్న పందులు

కె.గంగవరం: పామర్రు ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల వద్ద పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పాఠశాలకు వెళ్లే కూళ్ల–పామర్రు రహదారిలో పందుల పాకలు ఏర్పాటు చేయడంతో అవి బయటకు వచ్చి విచ్చలవిడిగా తిరురుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసే సమయంలో కూడా పందులు తిరుగుతున్నాయని పాకల నుంచి దుర్వాసన వెదజల్లి ఆహారం తినలేక పోతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. గతంలో అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని సుదీర్ఘంగా సమస్య పరిష్కారం కావడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయి అధికారులు స్పందించి పందుల సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోగికి ఆర్థిక సాయం

పి.గన్నవరం: మండలంలోని ముంజవరపు కొట్టు గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకుంటున్న ఎస్.వెంకట సత్యనారాయణకు లక్కవరం గ్రామానికి చెందిన లిటిల్ హార్ట్స్ సేవా యూత్ సభ్యులు ఆదివారం రూ.10 వేల సాయం అందించారు. యూత్ సభ్యులు బోనం దుర్గాప్రసాద్, మేడిచర్ల మెహర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు నల్లా పెద కాపు, బోనం రాజు, సాగిరెడ్డి గణేష్, గుండా బత్తుల హేమ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు రాజమహేంద్రవరానికి చెందిన నందూరి సంతోష్, అనంత దంపతులు ఆదివారం రూ.10,002 విరాళంగా అందించారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. దాత కుటుంబానికి అర్చకులు స్వామి వారి వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం , ప్రసాదాలను అందజేశారు.

వానొచ్చె.. వరదొచ్చె..



కోటిపల్లిలో పుష్కరఘాట్ మెట్ల వరకూ చేరి ప్రవహిస్తున్న వరద



కె.గంగవరంలో జోరుగా కురుస్తున్న వర్షం

- పెరుగుతున్న గోదావరి వరద ప్రవాహం
- మరింత పెరిగే అవకాశం

కె.గంగవరం: ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్‌కు భారీగా వరదనీరు చేరుతుంది. వరదనీటిని కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి వదలడం వల్ల కోటిపల్లిలో ఆదివారం ఉదయం నుంచి వరద పెరుగుతుంది. ఉదయం నుంచి గోదావరి గంటగంటకు పెరుగుతుందని స్థానికులు అంటున్నారు. గోదావరికి వరద పెరగడంతో లంకలో ఉన్న పశువులను రైతులు గట్టుకు చేరవేసి ఏటిగట్టుపై వాటికి ఆశ్రయం కల్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద మిగులు జలాలు సముద్రంలోకి వదలడం వల్ల ఈ రాత్రికి మరింత వరద వచ్చి చేరుతుందని స్థానిక రెవెన్యూ అధికారులు చెప్పడంతో మత్స్యకార కాలనీలో ఆందోళన నెలకొంది. కొద్ది పాటి వరదకే ఏటా కోటిపల్లిలోని మత్స్యకార కాలనీ నీటమునుగుతుంది.

ఆందోళనలో ముంపు గ్రామాల ప్రజలు

ఏటా గోదావరి వరద వచ్చే సమయంలో మండలంలోని గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలతో పాటు శేరిలంక గ్రామ ప్రజలకు కంటిమీద కునుకు ఉండదు. కూళ్ల నుంచి బ్రహ్మపురి వరకు ఏటిగట్టు పలు చోట్ల బలహీనంగా ఉండడంతో వారు మరింత ఆందోళనకు గురవుతున్నారు. సుందరపల్లి వద్ద ఉన్న ఏటిగట్టు ఏటా వరద వచ్చే సమయంలో కోతకు గురవుతుంది. అధికారులు మాత్రం ఎప్పటికప్పుడు తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నారు. వరద ఉధృతి అధికంగా ఉన్న సమయంలో ఇసుక బస్తాలు వేసి గట్టును పటిష్టం చేస్తున్నారు. మరో వైపు ఇసుక లారీల స్పీడుతో ఏటిగట్టు రహదారి అధ్వానంగా మారింది. గోతుల మయంగా మారి ఎక్కడ గట్టు తెగిపోతుందోనని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అయితే తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జోరు వాన

కె.గంగవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో గత రెండు రోజులుగా జోరువాన కురుస్తుంది. ఆదివారం ఉదయం, సాయంత్రం రెండు మూడు గంటల సేపు ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. రోజూ వాన కురవడం వల్ల భట్లపాలిక, కోట, కె.గంగవరం, అద్దంపల్లి తదితర గ్రామాల్లోని పల్లపు వీధులు జలమయమయ్యాయి. ఏకధాటిగా వర్షం కురవడంతో జన సంచారం లేక రోడ్లన్ని నిర్మానుష్యమయ్యాయి. ఉదయం నుంచి వర్షం కురవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండలంలో ప్రధాన కాలువలు టేకి డ్రెయిన్, రాజుకాలువ, పాణింగపల్లి పాత కాలువలు వర్షపు నీటితో పరిది దాటి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పల్లపు భూములున్న అముజూరు, కోటిపల్లి, పేకేరు, భట్లపాలిక తదితర గ్రామాల్లోని నారుమడులు నీట మునిగాయి. మరోవైపు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 40 శాతం వరకు నాట్లు పూర్తి చేయడం జరిగింది. మరో వారం రోజుల్లో పూర్తి స్థాయిలో నాట్లు వేసేస్తారని వ్యవసాయ శాఖ సిబ్బంది చెబుతున్నారు.

ఆధునిక వైద్యంపై అవగాహన అవసరం



అంగరలో వైద్య నిపుణులు తేజ, బాలలను సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

కపిలేశ్వరపురం: ఆధునిక శాస్త్ర సాంకేతి పరిజ్ఞానం నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో సేవలందించే పీఎంపీలకు నూతన వైద్య పద్ధతులపై అవగాహన అవసరమని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ కె.రామ్‌గోపాల్ తేజ, గైనకాలజిస్ట్ పి.మాణిక్యాంబ బాల అన్నారు. కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంగర గ్రామంలోని శ్రావణి క్లినిక్‌లో ఆదివారం ఆధునిక వైద్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో డాక్టర్ రామ్‌గోపాల్ తేజ, డాక్టర్ పిమాణిక్యాంబ బాల పలు అంశాలపై పీఎంపీలకు అవగాహన కల్పించారు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించడంలో పీఎంపీల సేవలు ప్రశంసించ దగినవన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ, నాయకులు సూరంపూడి వీరభద్రరావు, ఎం.వీరబాబు, సూరంపూడి సత్యనారాయణ, రుద్ర వెంకటలక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్‌తో దేశభక్తి, దైవభక్తి

గీతా మందిరంలో ఘనంగా గురుపూజోత్సవం



వెదురుపాకలో గురుపూజోత్సవం నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

రాయవరం: పౌరుల్లో దేశం పట్ల భక్తిని, దైవ భక్తిని పెంపొందించేందుకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) కృషి చేస్తోందని మండలంలోని వెదురుపాక గీతాజ్ఞాన మందిరం ట్రస్ట్ చైర్మన్ సత్తి రామకృష్ణారెడ్డి అన్నారు. గురు పూజోత్సవాన్ని ఆర్ఎస్ఎస్ వెదురుపాక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం గీతామందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరికీ దేశభక్తి, దైవభక్తి అవసరమన్నారు. దైవభక్తి మానసిక ప్రశాంతతను కలిగిస్తే, దేశభక్తి దేశం పట్ల గౌరవాన్ని పెంపొందిస్తుందన్నారు. రామచంద్రపురం పట్టణానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు నాగ సుధాకర్ ముఖ్య వక్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా కాషాయ జెండాను గురువుగా పూజించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు పడాల మణికంఠరెడ్డి, అంగర జనార్దనాచార్య స్వామి, పి.నాగరాజు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సీహెచ్‌వీవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల గ్రామోత్సవం



పసలపూడి పీర్ల పంజా గ్రామోత్సవంలో పూజలు చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు మంగతాయారు దంపతులు



అగ్ని గుండం తొక్కుతున్న ముస్లింలు

రాయవరం: మొహర్రం వేడుకల్లో భాగంగా ఏడో రోజైన ఆదివారం పసలపూడి గ్రామంలోని పీర్ల పంజా వద్ద ముస్లింలు పీర్ల గ్రామోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ నెల 17న మొహర్రం నిర్వహించుకోనుండగా, అందులో భాగంగా పీర్ల గ్రామోత్సవాన్ని జరుపుకున్నారు. ముస్లిం పెద్దలు షేక్ ఖాసిం (బుల్లి బాజి), ఫత్తల్లి, జిలాని, వల్లీ, బాబ్జీ, ఈసూబ్ బాషా తదితరుల ఆధ్వర్యంలో పీర్లను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు షేక్ ఖాసిం (బుల్లి బాజి), ఫత్తల్లి, జిలానీలు మాట్లాడుతూ మానవాళి కోసం చేసిన చారిత్రాత్మక పోరాటాన్నే మొహర్రంగా భావిస్తారన్నారు. హజరత్ ఇమామ్ హుసేన్ త్యాగానికి గుర్తుగా పంజా (ప్రతిమ) లను ఊరేగించి తమ సంతాపం ప్రకటిస్తారన్నారు. అనంతరం హుస్సేన్, పంజాలకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు బాబ్జి , షాజహాన్, కరీముల్లా, లాల్బా , బాషాభాయ్, ఆరిఫ్, రఫీ, షరీఫ్, అబ్దుల్లా, ఆలీ అబ్బాస్, బాషా, రిహాన్ తదితరులు అగ్ని గుండంలో నడిచి అల్లాపై తమకున్న భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, సొసైటీ మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు కుటుంబ సభ్యులతో కలసి పీర్ల గ్రామోత్సంలో పాల్గొని ప్రార్థనలు చేశారు. పీర్ల గ్రామానికి చెందిన అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం



గొల్లపాలెంలో కాలి బూడిదైన ఇల్లు



బాధిత కుటుంబీకులను పరామర్శించి రూ.50 వేల నగదు, దుస్తులు పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్

కాజులూరు: గొల్లపాలెంలోని డేగలపేట రోడ్‌లోని ఎస్సీ పేటలో మిరియాల సుబ్బారావుకు చెందిన తాటాకిల్లు అగ్నికి ఆహుతయింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం తెల్లవారుజామున మిరియాల సుబ్బారావు ఇంటిపై అకస్మాత్తుగా మంటలు సంభవించాయి. ఇంటిలో నిద్రిస్తున్న సుబ్బారావు కటుంబీకులు కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. స్థానికులు గమనించి బకెట్లతో నీళ్లచల్లి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అయినా అవి అదుపులోకి రాకపోవటంతో ఇల్లు మొత్తం కాలిబూడిదయింది. మండల తహసీల్దార్ శాంతిలక్ష్మి సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబీకులకు రూ.ఐదువేలు, 25 కేజీల బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు.

మంత్రి సుభాష్ రూ.50 వేల ఆర్థిక సాయం

గొల్లపాలెం ఎస్సీ పేటలో మిరియాల సుబ్బారావుకు చెందిన తాటాకిల్లు అగ్నికి ఆహుతైన విషయం తెలియగానే రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కట్టుబట్టలతో రోడ్డున పడ్డ బాధిత కుటుంబీకులను పరామర్శించి వారికి స్వచ్ఛందంగా రూ.50 వేల నగదు, దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా బాధితులను అన్ని విధాలుగా తాను అండగా ఉండి ఆదుకుంటానన్నారు. బాధిత కుటుంబానికి స్థానికులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, మేడిశెట్టి శేషారావు, కోట తాతబ్బాయి, అంగర కృష్ణ, తోట కృష్ణ, పెంకే అప్పారావు, పలివెల రాజు, బుంగా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సార్ .. హామీలు గుర్తున్నాయా?

- నెరవేరని గత టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన సీఎం చంద్రబాబు హామీలు
- ఇప్పుడైనా నెరవేర్చండి
- 'జన్మభూమి' ప్రారంభ కార్యక్రమంలో అంగరలో హామీలు
- ఇప్పటికీ నెరవేర్చని వైనం



అంగరలో చెత్తను సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు



2014 అక్టోబర్ 4న సీఎం చంద్రబాబుకు అంగరలో గ్రామ సమస్యలను చెబుతున్న అప్పటి సర్పంచ్ షణ్ముఖ శ్రీనివాస్ (ఫైల్)

కపిలేశ్వరపురం: 2014 అక్టోబర్ 4... 'జన్మభూమి–మావూరు' ప్రారంభ కార్యక్రమాన్ని స్వయంగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కపిలేశ్వరపురం మండలం అంగరలో ప్రారంభించారు. పేదల ప్రయోజనాలే లక్ష్యంగా కృషి చేస్తున్న పేదల ప్రభుత్వంగా తన పాలనను అభివర్ణించుకున్నారు. అడిగిందే తడవుగా నోటికొచ్చిన హామీలిచ్చేశారు. అంగర గ్రామాన్ని స్మార్ట్ విలేజ్‌గా తీర్చిదిద్దుతానని, అందుకు కావాల్సిన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత మరో నాలుగున్నరేళ్ల చంద్రబాబు సీఎంగానే ఉన్నారు. పాలనాకాలం కాలగర్భంలో కలిసిపోయింది తప్ప అంగర గ్రామానికి ఇచ్చిన హామీలు మాత్రం నెరవేరలేదు. మరో సారి ఇప్పుడు సీఎం చంద్రబాబు ఎన్నికయ్యారు. ఇప్పుడైనా అంగరకు ఇచ్చిన హామీలు నెరవేర్చమని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇవీ ఇచ్చిన హామీలు

2014లో సీఎం చంద్రబాబు ×జన్మభూమి మా ఊరు× కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అంగర వచ్చారు. వేదికపై కూర్చున్న అప్పటి సర్పంచ్ బట్టా షణ్ముఖ శ్రీనివాస్ గ్రామ సమస్యలను విన్నవించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ అంగర గ్రామం గురించి, గోదావరి తీరం, తీర ప్రాంత ఆహారపు అలవాట్లపై చమత్కారాలు కూడా పలికారు. పనిలో పనిగా అనేక హామీలు ఇచ్చారు. గ్రామాన్ని స్మార్ట్ విలేజ్‌గా తీర్చిదిద్దుతానన్నది ప్రధాన హామీ. జీ ప్లస్ టూ పద్ధతిలో గ్రామంలోని పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తానన్నారు. డంపింగ్ యార్డు స్థల సేకరణకు రూ. కోటి మంజూరు చేస్తానన్నారు.

నెరవేరని హామీలు

సీఎంగా తన పాలనాకాలం పూర్తయినప్పటికీ ఇచ్చిన హామీలు మాత్రం నీటి మూటలయ్యాయి. స్మార్ట్ విలేజ్ చేస్తానన్న హామీ అమలుకు ఏ మాత్రం చొరవ చూపలేదు. అంగర–కపిలేశ్వరపురం రహదారి విస్తరణ పనులు అసంపూర్తిగా నిలిచాయి. జీ ప్లస్ టూ పద్ధ నిర్మాణం చేస్తాన్న సీఎం సెంటు పావు స్థలాన్ని ఇద్దరికి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఆ స్థలం కూడా చంద్రబాబు హయాంలో కొన్నది కానే దు. మాజీ సీఎం వైఎస్సార్ హయాంలో సేకరించిన స్థలంలో జీప్లస్ టూ నిర్మాణాలు చేపట్టారు. సరైన సదుపాయాలు సైతం కల్పించని పరిస్థితి ఆనాటి పాలన చంద్రబాబుది.

మూతపడిన సుజల ధార

అంగరలో సురక్షిత తాగునీరు సరఫరా చేస్తున్నామంటూ ఎన్టీఆర్ సుజలధార ప్లాంట్‌ను చంద్రబాబు చేతులు మీదుగా ప్రారంభించారు. యానాంకు చెందిన ప్రైవేటు సంస్థ ఆర్థిక సౌజన్యంతో ఆ ప్లాంట్ నిర్మించారు. అది కాస్తా నిర్వహణా లోపంతో ఆయన హయాంలోనే మూత పడింది. తర్వాత కాలంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చారు.

డంపింగ్ యార్డుకు రూ.కోటి ఇస్తానన్నారు

సీఎం చంద్రబాబు మాట్లాడుతూ మేజర్ పంచాయతీగా ఉన్న అంగర గ్రామానికి డంపింగ్ యార్డు అవసరాన్ని గుర్తించానని త్వరలోనే రూ.కోటి నిధులు విడుదల చేస్తానంటూ హామీ ఇచ్చారు. అన్ని హామీల్లానే డంపింగ్ యార్డుకు నిధులు మంజూరు హామీ కూడా అటకెక్కింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మరోసారి సీఎం అయ్యిన నేపథ్యంలో నైనా ఇచ్చిన హామీలను వెవెంటనే నెరవేర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డంపింగ్ యార్డుకు నిధులు మంజూరు చేయాలి



సీఎం చంద్రబాబు స్పందించిన అంగర గ్రామానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. డంపింగ్ యార్డు ఆవశ్యకతను గుర్తించాలి. 2014లో ఇచ్చిన హామీ మేరకు ఎకరా స్థలాన్ని సమకూర్చి డంపింగ్ యార్డ్ సమస్య తీర్చాలి. ఆ దిశగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. –పసలపూడి శ్రీనివాస్, గ్రామస్తుడు, అంగర

వరి సాగులో నారుమడుల దశ నుంచి జాగ్రత్తలు తీసుకోవాలి

కాజులూరు: వరి సాగులో నారుమడుల దశ నుంచి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం తూర్పు డెల్టాలో నారుమడుల దశ కొనసాగుతుందన్నారు. మండలంలో కొందరు రైతులు నారుపోసి నాట్లు వేసే విధానాన్ని అవలంభిస్తుండగా, కొందరు రైతులు వెదచల్లిక (నేరుగా వరి విత్తనాలను చదును చేసిన పొలంలో చల్లడం) విధానాలను అవలంభిస్తున్నారన్నారు. వెదచల్లిక విధానంలో మొలక శాతం తకువగా ఉన్నట్లయితే వరి మొక్కల మధ్య దూరం పెరుగుతుందన్నారు. నారుమడుల విధానంలోను మొలక శాతం తకువగా ఉన్నట్లయితే నారుకొరత ఏర్పడుతుందన్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు రైతులు ముందుగానే వరి విత్తనాల్లో మొలక శాతాన్ని పరిశీలించి విత్తనాలు చల్లుకోవాలన్నారు. నారు ఆరోగ్యంగా ఉంటేనే మొక్క బలంగా పెరుగుతుందన్నారు. విత్తనాల మొలకశాతాన్ని పరిశీలించేందుకు పలుచనిగుడ్డ, లేదా సరైన కాగితాన్ని తీసుకుని మడతలు, మడతలుగా చేయాలన్నారు. 100 వరి విత్తన గింజలను తీసుకుని మడతల మధ్య ఉంచి దానిని 24 గంటలు పూర్తిగా నీటిలో నానబెట్టాలన్నారు. తర్వాత పైకితీసి 24 గంటలు పొడిగుడ్డ లేదా గడ్డితో కప్పి మండే కట్టాలన్నారు. ఐదు రోజుల తర్వత మొలక శాతాన్ని లెక్క కట్టాలన్నారు. 80 గింజలు తక్కువ కాకుండా మొలకెత్తినట్లయితే అవి నాణ్యమైనట్టుగా గుర్తించి మొత్తం విత్తనాలను నానబెట్టుకోవచ్చన్నారు.

నడిచేందుకు దారేది?



మొసలపల్లి గరువులో అధ్వానంగా ఉన్న రహదారి

అంబాజీపేట: గత ముప్పై ఏళ్లుగా నడిచేందుకు రహదారి లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మొసలపల్లి శివారుగరువు వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చినుకుపడితే చెరువులా మారిపోయే ఈ రహదారిలో పయాణించాలంటే ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంతలు పడ్డ ఈ మార్గంలో పాఠశాలకు చిన్నారులు, విద్యార్థులు, వృద్ధులు, ఉద్యోగులు, రైతులు నానా కష్టాలు పడాల్సి వస్తుంది. పలుమార్లు రహదారులు నిర్మించాలని అప్పటి ప్రజాప్రతినిధులను, అధికారులను కోరినప్పటికీ పట్టించుకోకుండా గాలికి వదిలేశారని గరువు వాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారులు నిర్మించాలని కోరుతున్నారు.

ముందు జాగ్రత్తలతో వాస్క్యులర్‌ను అరికట్టవచ్చు



అంబాజీపేటలో రోగులకు వైద్యం చేస్తున్న డాక్టర్ సోమాచారి

అంబాజీపేట: వంశపారంపర్యం, అధిక బరువు, నిలబడి పని చేయడం వల్ల వచ్చే వాస్క్యులర్ సమస్యలకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకొంటే అరికట్టవచ్చని హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ వాస్క్యులర్ వైద్యుడు సోమాచారి అన్నారు. స్థానిక సత్యసాయి సేవా సమితి, ఏషియన్ వాస్క్యులర్ ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అంబాజీపేటలో డాక్టర్ ఢిల్లీబాబు ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సోమాచారి మాట్లాడుతూ వాస్క్యులర్ సమస్య ప్రాణాంతకం కాదని ఎంతో ఇబ్బందికరమైందని పేర్కొన్నారు. కాలి పిక్కల వద్ద ఉండే మజిల్స్‌లో రక్తం ఎక్కువగా నిల్వ ఉండిపోవడం వల్ల రక్తనాళాలు ఉబ్బి ఇటువంటి పరిస్థితి ఏర్పడుతుందన్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న డా.జీవీ ప్రవీణ్ ఏషియన్ వాస్క్యులర్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా లేజర్ ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని తుని, పెద్దాపురం, సఖినేటిపల్లి, తణుకు తదితర దూర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 200 మంది రోగులు వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో స్థానిక సత్య సాయి సేవా సమితి సభ్యులు తిరువూరి బాబా, మన్యం వర్ధనరావు, పెచ్చెటి సత్యనారాయణ, అడపా ప్రసాద్, మంచాల శేషు, ఎస్.భార్గవి, నిట్టాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాళాలు పగులగొట్టి ఆభరణాల చోరీ



చోరీ జరిగిన ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులను, ఇనుప బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

అంబాజీపేట: ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఓ ఇంటి తాళాలను పగలగొట్టి బంగారం, వెండి వస్తువులు, నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంగలకుర్రు అగ్రహారానికి చెందిన రిటైర్డ్ తహసీల్దార్ రాయుడు సత్యనారాయణమూర్తి తన భార్యతో కలసి వారి కుమార్తె వైద్య పని నిమిత్తం ఈ నెల 8న కాకినాడ వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చి సరికి తాళాలు పగులగొట్టి తలుపులు తెరిచి ఉండడాన్ని గుర్తించారు. ఇంటికి ఉన్న మూడు తలుపులకు వేసిన తాళాలను పెకిలించి, లోపల బీరువాను పగులగొట్టారు. అందులో ఉన్న రూ.15 వేల నగదు, 10 గ్రాముల బంగారు ఆభరణాలు, దేవుని మందిరంలో ఉన్న వెండి చెంబు, దేవుని విగ్రహాలు, ఏనుగు బొమ్మలు తదితర 2 కేజీల వెండిని అపహరించుకుపోయారు. జరిగిన సంఘటనను అంబాజీపేట పోలీసులకు వివరించారు. చోరీ జరిగిన ఇంటిని ఎఎస్సై ఎ.సూర్యనారాయణ తన సిబ్బందితో పరిశీలించి, క్లూస్ టీమ్‌ను రప్పించారు. బాధితులు సత్యనారాయణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. చోరీకి జరిగిన సంఘటనపై గ్రామంలో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.